క్లుప్తంగా

విద్యుత్ మోటారు చోరీ

కొల్లూరు : తాగునీటి పంపుకు బిగించి ఉన్న విద్యుత్ మోటారు చోరీకి గురైన ఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధిత కుటుంబం తెలిపిన వివరాల మేరకు.. కొల్లూరు లాక్ సెంటర్‌లోని వినాయకుడి ఆలయం సమీపంలో రహదారి వెంబడి నివసిస్తున్న శిగిలిశెట్టి వేణు తన ఇంటి వరండాలో తాగునీటి పంపుకు విద్యుత్ మోటార్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. సోమవారం రాత్రి నిద్రకు ఉపక్రమించిన అనంతరం మధ్యరాత్రిలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వచ్చిన సమయంలోనూ ఉన్న మోటార్, తెల్లవారుజామున లేచి చూసే సరికి చోరీకి గురైనట్లు గ్రహించారు. ఇటీవల కొల్లూరులో దొంగతనాలు తరచుగా చోటు చేసుకుంటుండటంతో ప్రజలలో ఆందోళన వ్యక్తమవుతుంది. పోలీసులు రాత్రి వేళల్లో నిఘాను పటిష్టం చేసి దొంగతనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. మోటారు చోరీపై బాధితుడు కొల్లూరు పోలీసులను ఆశ్రయించాడు.

వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ అందించాలి

తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు



రేపల్లె: ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ సరుకులను వృద్ధులకు ఇంటి వద్దకే తీసుకెళ్లి అందించాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు సచివాలయ సిబ్బందికి సూచించారు. రేషన్ పంపిణీ విధానంపై మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పరిధిలోని 65 సంవత్సరాలు నిండిన వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడే వారిని గుర్తించి ప్రతి నెల క్రమం తప్పకుండా ఇంటికి వెళ్లి రేషన్ అందించాలని అన్నారు. మిషన్‌లు వృద్ధుల వేలిముద్రలు తీసుకోని యెడల వీఆర్వో వేలిముద్ర ద్వారా రేషన్ అందించవచ్చన్నారు. రేషన్ అందజేతలో ఏమైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు రేషన్ డోర్ డెలివరీ చేయాలి



కర్లపాలెం: దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులకు రేషన్ సరుకుల డీలర్‌లు డోర్ డెలివరీ చేయాలని బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా చెప్పారు. కర్లపాలెంలోని 10వ నంబర్ రేషన్ దుకాణంను ఆర్డీవో మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ కార్డుదారులకు అసౌకర్యం కలుగకుండా టైమ్ ప్రకారం షాపు తెరిచి ఉంచి రేషన్ సరుకులు అందజేయాలని చెప్పారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 వరకు షాపు తెరిచి ఉంచాలని ఆమె ఆదేశించారు. రేషన్ షాపు పరిధిలోని కార్డుదారులందరికీ సక్రమంగా రేషన్ సరుకులు అందించాల్సిన భాద్యత రేషన్ డీలర్లపై ఉందని అన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ సుందరమ్మ, ఎంపీడీవో శ్రీనివాసరావు, వీఆర్వో సాంబయ్య తదితరులు ఉన్నారు.

సైనికుడు, సేవకుడు పుస్తక కవర్ పేజీని ఆవిష్కరణ



కవర్ పేజీని ఆవిష్కరిస్తున్న గవర్నర్ దత్తాత్రేయ

తెనాలిఅర్బన్: మాజీ సైనికుడు సీబీఆర్ ప్రసాద్ జీవిత చరిత్రను తెలియజేసే సైనికుడు–సేవకుడు పుస్తక కవర్ పేజీని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సీబీఆర్ ప్రసాద్‌ను గవర్నర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, తెనాలికి చెందిన అయినంపూడి రత్నప్రసాద్ మాట్లాడుతూ ఎయిర్‌ఫోర్స్‌లో తొమ్మిది సంవత్సరాలు సైనికుడిగా సీబీఆర్ ప్రసాద్ పనిచేశారని చెప్పారు. భారత రక్షణశాఖకు రూ.1.8 కోట్ల విరాళాన్ని రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్‌కు అందజేసినట్లు చెప్పారు. అలాగే రూ.30 కోట్లతో సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఇటీవల సంభవించిన వరదల్లో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు రూ.54 లక్షల చొప్పున అందజేసినట్లు వివరించారు. కరోనా సమయంలో అంబులెన్స్‌ల కోసం రూ.3 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనికుడు వాకా ఆదినారాయణ పాల్గొన్నారు.

ఖరీఫ్ సన్నద్ధతలో అన్నదాతలు

- దుక్కులు దున్నుకొని పొలాలను సిద్ధం చేస్తున్న కర్షకులు
- రబీ సాగు వ్యర్థాల తొలగింపు పనిలో వ్యవసాయ కూలీలు
- గట్లు సరిచేసుకోవడంపై రైతుల దృష్టి



కొల్లూరు-బొద్దులూరుపాడు మార్గంలో పంట పొలాన్ని రోటోవేటర్‌తో గుల్లబార్చే యత్నం



క్రాప వద్ద పశువుల వ్యర్థాల సేంద్రియ ఎరువును వెదజల్లుకుంటున్న రైతు

కొల్లూరు : కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నా అన్నదాతలు మొక్కవోని దీక్షతో ఖరీఫ్ సాగు పనులలో తలమునకలవుతున్నారు. ప్రభుత్వం అన్నదాతల సంక్షేమాన్ని గాలికి వదిలేసినప్పటికీ, వరుణుడు కరుణించి ముందుస్తుగా వర్షాలు కురవడంతో పంట భూములు పదునుకు రావడంతో వ్యవసాయ పనులను కర్షకులు వేగవంతం చేశారు. గతేడాది సాగు చేసిన వరి, మొక్కజొన్న, జొన్న పంటలకు సరైన మద్దతు ధర లభించకపోవడం, మొక్కుబడిగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోళ్ల కేంద్రాలతో రైతులకు ప్రయోజనం చేకూరలేదు. పెరిగిన పెట్టుబడులకు తోడు, పండించిన పంట దిగుబడులకు ధరలు లభించక పోవడంతో నిరాశ, నిస్పృహలకు గురైన రైతులు ఈ ఏడాదైనా పంటలకు గిట్టుబాటు ధరలు లభిస్తాయన్న ఆశా దృక్పథంతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు.

సుమారు 85 వేల ఎకరాలలో...

వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు, అమృతలూరు, చుండూరు మండలాల పరిధిలోని సుమారు 85 వేల ఎకరాలలో వరి సాగుకు అవసరమైన ముందస్తు పనులను చేపట్టి పంట పొలాలను సాగుకు సిద్ధం చేసే పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండి పంట పొలాలు పొడిబారడంతో దుక్కులు దున్నుకోవడం, రోటోవేటర్‌తో సాగు భూములను గుల్లబార్చుకొనే పనులలో రైతులు నిమగ్నమయ్యారు. దుక్కుల పనులతోపాటు, రబీలో సాగు చేసిన జొన్న, మొక్కజొన్న వ్యర్థాల తొలగింపు పనులు, పొలం గట్లు సరిచేసుకోవడం వంటి పనులు రైతులు చేపడుతున్నారు. పంట పొలాలను సారవంతంగా ఉంచేందుకు అవసరమైన సేంద్రియ ఎరువులను సైతం పంట పొలాలకు అందించేందుకు పశువుల వ్యర్థాలను పొలాల్లో వెద జల్లుకోవడంతోపాటు, కొంత మంది రైతులు భూమిలో కలియదున్నే జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట ఎరువులకు అవసరమైన పంటలను సాగు చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

అభయాంజనేయునికి వార్షికోత్సవ పూజలు



కర్లపాలెం: మండల పరిధిలోని పాతనందాయపాలెం గ్రామంలో వేంచేసియున్న అభయాంజనేయ స్వామి వారి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం వైభవంగా పూజలు నిర్వహించారు. స్వామి వారి విగ్రహాన్ని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజారులు అర్చనలు, అభిషేకాలు, ఆకుపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం వైఫల్యం

- నేడు పట్టణంలో నిరసన శాంతి ర్యాలీని జయప్రదం చేయాలి
- వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



రేపల్లె: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో కూటమి ప్రభుత్వం తీవ్రంగా వైఫల్యం చెందిందని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. అధికారం కోసం ఒకలా, అధికారంలోకి వచ్చిన తరువాత మరోలా వ్యవహరించటం చంద్రబాబుకు అలవాటేనన్నారు. అమలు చేయలేని హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంవత్సరం గడుస్తున్నా ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను మోసగించిందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను అమలు చేయడం జగన్‌మోహన్ రెడ్డి నైజం అయితే అధికారం కోసం దొంగ హామీలు ఇచ్చి ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజం అన్నారు. గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు కంటే అధికంగా అందజేస్తామని ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలు చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక బడ్జెట్ లేదని సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. ఎండీయూ వాహనాలను రద్దుచేసి వేలాది మంది ఉపాధిపై దెబ్బ కొట్టారన్నారు. వలంటీర్ వ్యవస్థను తొలగించి వారి జీవితాల్లో చీకటిని నింపారని దుయ్యబట్టారు. ప్రభుత్వ అసమర్థతను ప్రజలకు వివరిస్తూ, సంవత్సర ప్రభుత్వ పాలనను ప్రశ్నిస్తూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4న బుధవారం వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బుధవారం ఉదయం 10 గంటలకు రేపల్లె పట్టణం ఇసుకపల్లి సెంటరు నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన శాంతి ర్యాలీ నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకర్గంలోని మండల పార్టీ కన్వీనర్‌లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వాగ్దానాలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు .. వేమూరు మండల అధ్యక్షుడు

వేమూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ వేమూరు మండల అధ్యక్షుడు దాది సుబ్బారావు అన్నారు. 4వ తేదీ బుధవారం వెన్నుపోటు దినం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కొల్లూరు మండలంలో నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని కార్యకర్తలు జయప్రదం చేయాలని కోరారు.

కూటమి వైఫల్యాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి

కొల్లూరు : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినప్పటికీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడవడాన్ని పురస్కరించుకొని బుధవారం కొల్లూరులో వైఎస్సార్‌సీపీ నేతృత్వంలో 'వెన్నుపోటు దినం' నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు కొల్లూరు – తెనాలి మార్గంలో పెట్రోల్ బంక్‌ల ప్రాంతం నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు ప్రదర్శనగా తరలివెళ్లి వినతిపత్రం సమర్పించనున్నట్లు ఆయన ప్రకటించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలోకి తీసుకువెళ్లడంతోపాటు, ప్రజలను మోసగిస్తున్న తీరుతెన్నులపై చేపట్టిన నిరసన కార్యక్రమానికి నియోజకవర్గంలోని కొల్లూరు, వేమూరు, భట్టిప్రోలు, అమృతలూరు, చుండూరు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం

అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి నజీఫ్



ఓల్డ్‌టౌన్ అర్బన్ హెల్త్ సెంటరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



కూచినపూడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రేపల్లె: దోమల నివారణతో పలు వ్యాధులను దూరంగా ఉంచవచ్చని ఓల్డ్‌టౌన్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ఎస్‌కే నజీఫ్ అన్నారు. మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం మలేరియా సబ్‌యూనిట్ ఆధ్వర్యంలో ఓల్డ్‌టౌన్ అర్బన్ హెల్త్ సెంటరులో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దోమలతో మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తేమ వాతావరణం లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వల్లో దోమలు వృద్ధి చెందుతాయని, నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. జ్వరం, ఒళ్ళునొప్పులు, తలనొప్పి వంటి సమస్యలు తలెత్తితే వైద్యుడిని సంప్రదించి చికిత్స చేయించుకోవాలన్నారు. మలేరియా నిర్మూలనకు నిర్వహించిన ర్యాలీలో ఆరోగ్య సిబ్బంది పాల్గొని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ సారంగపాణి, సూపర్‌వైజర్‌లు ఎల్లయ్య, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు. అదేవిధంగా నిజాంపట్నం మండలం కూచినపూడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు మురళి, సాంబశివరావు, ఎంపీహెచ్‌ఈవో మాధవి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

సీడీపీవో సుచిత్ర



రేపల్లె : బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని సీడీపీవో సుచిత్ర చెప్పారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని 13వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కిశోరి వికాసం సమ్మర్ ప్రత్యేక క్యాంపులో ఆమె పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను గ్రామీణులకు తెలియపరచాలన్నారు. యువతికి 18, యువకునికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలని, బాల్య వివాహాలు జరిపినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమన్నారు. 2 సంవత్సరాలు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడంతోపాటు ఐదు సంవత్సరాలు దాటిన చిన్నారులను పాఠశాలలకు పంపేలా అంగన్‌వాడీలు బాధ్యత వహించాలన్నారు. బాల్య వివాహ, బాల కార్మిక, విద్యా హక్కు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివజ్యోతి, మహిళా సంరక్షణ కార్యదర్శి కవిత, అంగన్‌వాడీలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రలో పాల్గొనండి

తెనాలిఅర్బన్: యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం జరుగుతున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో మేనేజర్ విల్సన్ జయకర్, ఆర్‌వో రాంప్రసాద్ తదితరుపాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె: ఇసుకపల్లిలోని 11 కేవీ ఫీడర్, పేటేరులోని ఫీడర్‌లలో మరమ్మతుల నేపథ్యంలో బుధవారం ఉదయం 8 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డిప్యూటీ ఈఈ శ్యామ్‌సుధాకర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండ్ నుంచి ఇసుకపల్లి సెంటరు వరకు, గరువురోడ్డులో, మండలంలోని ఉప్పూడి, పేటేరు, మోర్లవారిపాలెం గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేమూరు: వేమూరు ఫీడర్‌పై విద్యుత్ లైన్ మరమ్మతుల కోసం బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ గోపి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని వేమూరు టౌన్, జంపని రోడ్డు ఏరియాల్లో విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని చెప్పారు.

అమర్తలూరు(వేమూరు): విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని డీఈఈ డి.రాజశేఖర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమర్తలూరు మండలంలోని మూల్పూరు సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ మూల్పూరు ఫీడర్‌లో మరమ్మతులు నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

చుండూరు(వేమూరు): విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ దోనేపూడి అర్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చుండూరు మండలంలోని మున్నంగివారిపాలెం, నడిగడ్డవారిపాలెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

కొల్లూరు : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్తు శాఖ ఏఈ సుధాకర్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొల్లూరు సబ్ స్టేషన్ నుంచి దోనేపూడి ఫీడర్ వైపు వెళ్లే 11 కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని దోనేపూడి, చినపులివర్రు, కోటిపల్లి, భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు దిగువలోని కొంత భాగం వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎప్పుడు తెరుచుకుంటుందో..!?

- అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు గ్రహణం
- కేంద్రాల పనితీరుపై విమర్శల వెల్లువ
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



కొల్లూరు మండలం క్రాప సచివాలయం వద్ద తాళం వేసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

కొల్లూరు : అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై పర్యవేక్షణ లోపం కారణంగా పని సమయాలలో సైతం కేంద్రాలు తాళాలు వేసి దర్శనమిస్తున్నాయి. చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేసి, చిన్నారుల మానసిక వికాసానికి దోహదపడాల్సిన అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు రోజురోజుకు తీసికట్టుగా మారుతుంది. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ విషయంలో ఐసీడీఎస్ సిబ్బందితోపాటు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ కొరవడటంతో కేంద్రాలు తూతూమంత్రంగా నడుస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు గ్రహణం పట్టిందనడానికి మండలంలోని క్రాప బీసీ ప్రాంతంలో సచివాలయంను ఆనుకొని ఉన్న కేంద్రం పని వేళల్లో తాళం వేసి ఉండటం నిదర్శనంగా నిలుస్తుంది. కొల్లూరు మండలంలో కొల్లూరు, దోనేపూడి, అనంతవరం సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై నిరంతరం విమర్శలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాల్సిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు సమయపాలన పాటించకుండా ఇష్టమైన సమయాలలో కేంద్రాలు తీయడం, సమయం పూర్తవకముందే కేంద్రాలను మూసి వేయడం పరిపాటిగా మారిందని గ్రామాలలో ప్రజల నుంచి ఆరోపణలు వెలువడుతున్నాయి. కొంత మంది అంగన్‌వాడీ కార్యకర్తలు అసలు కేంద్రాలు తీయకుండానే నెట్టుకొస్తూ, ముందుగానే తీసిపెట్టుకున్న ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐసీడీఎస్, మండల అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రజలు కోరుతున్నారు.

సీనియర్ ఫొటో జర్నలిస్టు నాగేశ్వరరావు గుండెపోటుతో మృతి



బాపట్ల: సీనియర్ ఫొటో జర్నలిస్టు గగ్గూరి నాగేశ్వరరావు(65) గుండెపోటుతో సోమవారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందారు. ఫొటోగ్రాఫర్‌గా, జర్నలిస్టుగా 40 సంవత్సరాలపాటు బాపట్లలో పని చేశారు. నాగేశ్వరరావుకు భార్య కుమారితోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగేశ్వరరావు మృతికి మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్‌తోపాటు పలువురు నివాళి అర్పించారు. ఆయన మృతదేహాన్ని బాపట్లలోని శృంగారపురంలోని ఆయన నివాసం నుంచి బుధవారం అంత్యక్రియలు తీసుకువెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

5న జరిగే మహాసభల్లో అందరూ పాల్గొనండి

తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన విజయవాడ బందర్ రోడ్డులోని ఎస్ఎస్‌ఏసీ కన్వెన్షన్ హాల్‌లో జరిగే మహాసభల్లో అందరూ పాల్గొనాలని ఆ సంఘ తెనాలి అధ్యక్షుడు షేక్ జానీబాషా ఒక ప్రకటనలో కోరారు. మహాసభల్లో ఉద్యోగుల సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. అలాగే సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను సంఘ నాయకులు ప్రకటించనున్నట్లు చెప్పారు. ప్రకటనపై సంతకాలు చేసిన వారిలో కార్యదర్శి కె.ధర్మసాయి, ఉపాధ్యక్షుడు ఎస్.అజయ్‌కుమార్, కళ్యాణ్, భాస్కర్ ఉన్నారు.